

వివరాలు మెయిన్‌లో

నాగార్జునసాగర్‌లో మళ్లీ జల వివాదం!


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 27 ఆగస్టు , 2026 | పేజీలు :4







వివరాలు మెయిన్‌లో

14 మందికి తీవ్రగాయాలు

కోదాడ సమీపంలో ఘటన

క్షతగాత్రులకు మెరుగైనవైద్యం అందించాలని ఆదేశం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి

బస్సు ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి

# అతివేగం ఘోరప్రమాదం ఆరుగురి మృతి







# కార్మికుల సమస్యల కోసం ఎఐటియుసి సమరశీల పోరాటాలు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

భువనగిరిలో కదం తొక్కిన కార్మికులు..

3వ మహాసభ సందర్భంగా భువనగిరిలో భారీ ర్యాలీ..

వివరాలు మెయిన్‌లో



## స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధికి చిహ్నంగా నిలిచే స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ పోల్నేడి నర్సమ్మ శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. బుధవారం మండల పరిధిలోని గుడిమల్కాపురం గ్రామ పంచాయితీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భూమి పూజా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలనే ఉద్దేశంతోనే ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిశెట్టి నర్సింహారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామస్తుల నిరసన



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నగారకుంట తండ గ్రామంలో తాగడానికి నీరు లేక ఉన్న బోర్లు కూడా ఎండిపోవడంతో మిషన్ భగీరథ నీళ్ళు కూడా రావడం లేదన్నారు. దీనిపై అధికారులకు విన్నవించుకున్న ఎవరూ పట్టించుకోవడం లేదని, కనీసం ఫోన్లు కూడా ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన మంచినీటి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## సోమయ్య మృతి కాంగ్రెస్‌కి తీరనిలోటు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** కోడూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సర్పంచ్ వల్లపు అవిలమ్మ భర్త సోమయ్య అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర వ్యవసాయ రైతు కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కోడూరు గ్రామంలో సోమయ్య చిత్రపటానికి సీనియర్ నాయకులు దరూరి యోగానంద చార్యులుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నాయకులు నర్సింగ శ్రీనివాస్ గౌడ్, మోరపాక సత్యం, ముక్కాల అవిలమల్లు, భాషపోలు శ్రీనివాసు, సర్పంచ్ బింగి కృష్ణమూర్తి, వల్లాల ఖాజా, బొల్లం సైదులు, మధు, సురేష్, రాజు పాల్గొన్నారు.



## గత ప్రభుత్వంలో అభివృద్ధి నోచుకోని వార్డు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గత ప్రభుత్వంలో వార్డు వెనుకబడిందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 36వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి మంజూరైన రూ.5లక్షలతో నూతనంగా నిర్మించనున్న కల్వర్టు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. 60 పీట్ల రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గోపాలపురం చర్చి స్థలం 10 గుంటల భూమిని తీసుకొని వారికి మరొకచోట ఇప్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు జాతీయ రహదారి అనుసంధానానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటి పరిధిలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం చేపడుతామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్ షేక్ మన్సూర్‌బీ ఫారూఖ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కెజిబివి చివ్వెంల పాఠశాలకు రూ.30వేల విలువైన మోటార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని అన్నారు. పాఠశాల అవసరాలను తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైన మేరకు సహకారం అందిస్తానని తెలిపారు. త్వరలో పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లకు అవసరమైన మెటీరియల్‌ను కూడా త్వరలో అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడితే వారు విద్యలో మరింత రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ పులన్, పాఠశాల ఉద్యోగులు జి. దుర్గ, డి. సుజాత పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సకు ఆధునిక వైద్య విధానాలు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** క్యాన్సర్ చికిత్సకు ప్రస్తుతం అనేక ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోగికి ఒకే రకమైన చికిత్స విధానం సరిపోదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ కుమార్ మల్లభట్టు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ రకం, వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స విధానాన్ని నిర్ణయిస్తామని తెలిపారు. క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం, రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడం, చికిత్స వల్ల కలిగే దుష్ప్రభావాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం ఆధునిక క్యాన్సర్ చికిత్స ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఆధునిక సాంకేతికతతో చికిత్సలో దుష్ప్రభావాలను తగ్గించడంతోపాటు చికిత్స ప్రభావాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో అత్యాధునిక వికిరణ చికిత్స సాంకేతికతతో కూడిన హైవర్ సైట్ యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. చికిత్సను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించడం ఈ సాంకేతికత ప్రత్యేకత అన్నారు. ప్రతి నెల రెండో, నాలుగో బుధవారాల్లో సూర్యాపేటలోని కనెక్ట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రోగులకు వైద్య సలహాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి మేనేజర్ కర్నె సుదర్శన్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన గతుల గురుకుల బాలికల కళాశాల,పట్టణంలోని కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఓఈ) లో ఫ్రషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.వి.రమేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాలు దేవాలయాల వంటివని పేర్కొన్నారు. నల్లగొండలో తొలి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసినందుకు ఎంజేపీ తెలంగాణ గురుకుల సంస్థల సెక్రటరీ సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలోని అత్యంత ప్రతిభావంతులైన అధ్యాపకులను ఈ కళాశాలలో నియమించి నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమన్నారు.ఇంజినీరింగ్,వైద్య విద్యతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా రంగాల్లో అత్యుత్తమ కళాశాలల్లో సీట్లు సాధించేందుకు ఈ కళాశాల విద్యార్థులకు సువర్ణ అవకాశమని అన్నారు. తమకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## గ్రామస్తుల స్వచ్ఛంద బాట

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మన ఊరు, మాన బాధ్యత పర్యావరణ పరిరక్షణ కోసం తమ గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే సంకల్పంతో నేరేడుచర్ల మండలం గంటవారిగూడెం గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో సుమారు 40వేల రూపాయల సొంత నిధులతో ఆశోక్ మొక్కలను కొనుగోలు చేసి, బుధవారం గంటవారిగూడెం నుండి సోమారం అర్‌అండ్‌బి రోడ్డు వైపు సుమారు కిలోమీటర్ మేర రహదారి వెంట మొక్కలు నాటే కార్యక్రమంను మండల పార్టీ అధ్యక్షులు కొణతం చిన్న వెంకటరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన అసవరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లంసెట్ల లచ్చయ్య, జ్యోతిబాబు, బచ్చలకూరి ప్రకాశ్, తాళ్ల సురేష్‌రెడ్డి, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయం 5వ వార్షికోత్సవం సందర్భంగా కొప్పుల వేణారెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ మహేష్, దేవాలయ అధ్యక్షుడు ఉప్పల సత్యనారాయణ, మిర్యాల కొండలరావు, ముప్పారపు బాబురావు, పివి సాగర్ పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో అపరిశుభ్ర తాగునీరు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, అపరిశుభ్రమైన నీటిని అందిస్తూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోతుగంటి కాశి ఆందోళన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను, అక్కడి తాగునీటి వ్యవస్థను బుధవారం పరిశీలించి మాట్లాడారు. బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ప్రధాన వాటర్ ట్యాంకు పూర్తిగా అపరిశుభ్రంగా మారిందని తెలిపారు. ట్యాంక్ పైభాగం మూత లేకుండా ఖాళీగా ఉండటంతో అందులో చెత్తాచెదారంతో పాటు క్రిమి కీటకాలు, పురుగులు పడుతున్నాయని చెప్పారు. అదే ట్యాంక్ నుంచి పైపుల ద్వారా కనెక్షన్ ఇచ్చి ఫ్రిడ్జ్‌లోకి నీటిని పంపుతున్నారని, ఆ నీటినే ప్రయాణికులు తెలియక తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘం ప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రయాణికులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/చౌటుప్ప:** ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాములు అన్నారు.చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రాల్లో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం ఉద్యోగుల ఇచ్చిన హమిలను నేరవేర్చడంలో నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు.



## అయ్యప్ప ఆలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/అనంతగిరి:** తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో 2026 సంక్రాంతి పండుగ నుండి ప్రారంభం అయిన ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ 33వ వారం అమ్మగూడెం వాస్తవ్యులు సత్యాల ప్రభాకర్‌రేణుక దంపతులు, ఖానాపురం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్రీనివాసరావు అంజలి దంపతులు దాతలుగా వ్యవహరించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుచైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, గింజుపల్లి జగన్, బాణోతు బాబు, గింజుపల్లి వెంకటయ్య, జొన్నలగడ్డ శ్రీనివాస్, కిరణ్, ధారావత్ హుస్సేన్, దండు రమేష్, భక్తులు పాల్గొన్నారు.

## రూ. 55,555 అందజేత



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కేంద్రంలోని స్థానిక సీతారామ చంద్ర స్వామి ఆలయ పునఃనిర్మాణం, ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా బుధవారం బొడిగె సంధ్య యాదగిరి రూ. 55,555లను ఆలయ కమిటి సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ చలపతిరావు, ఆలయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మదర్‌థెరిస్సా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మానవ సేవే మాధవ సేవగా భావించి జీవితాంతం పేదలు, అనాథలు, నిరుపేదల కోసం సేవలందించిన మదర్ థెరిస్సా జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని బెథెస్త ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుర్గం ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో రోగులకు కలిసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ దుర్గం కరుణ, సైదులు, జాటోత్ డేవిడ్ రాజ్, దుర్గం అంజి, విక్రం పాల్గొన్నారు.

## ప్రారంభమైన మద్దెలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణం కేంద్రంలోని మద్దెలమ్మ అమ్మవారి 10వ వార్షిక మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అఖండ దీపారాధన,గణపతి, ధ్వజారోహణం నిర్వహించారు.వరసిద్ధి వినాయక,శివలింగం,సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహ పత్రిష్ట చేశారు.

## మిర్యాలగూడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా గంజి శ్రీనివాస్ విజయం సాధించారు. స్థానిక చేనేత సహకార సంఘ కార్యాలయంలో బుధవారం ఎన్నికల అధికారి ఎండీ మహీముద్ అధ్యక్షతన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. చేనేత సహకార సంఘానికి ఎన్నికైన 9 మంది కార్యవర్గ సభ్యులు సమావేశమై నూతన పాలకవర్గం ఎంపికపై రెండు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. అయితే ఏకాభిప్రాయం కుదరక పోవడంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చిందని ఎన్నికల అధికారి మహీముద్ తెలిపారు. అధ్యక్ష పదవికి ఆయిటిపాముల మురళీధర్, గడ్డం రమణయ్య, గంజి శ్రీనివాస్ పోటీ పడ్డారు. 9 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోగా మురళీధర్‌కు సున్నా ఓట్లు, గడ్డం రమణయ్యకు 03 ఓట్లు రాగా, గంజి శ్రీనివాస్‌కు 06 ఓట్లు లభించాయి. దీంతో గంజి శ్రీనివాస్ అధ్యక్షుడిగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.ఉపాధ్యక్ష పదవికి రాపోలు కృష్ణమూర్తి, రాపోలు వెంకటేశ్వర్లు పోటీ పడగా నిర్వహించిన పోలింగ్‌లో రాపోలు కృష్ణమూర్తికి 08 ఓట్లు, రాపోలు వెంకటేశ్వర్లకు 01 ఓటు లభించాయి. దీంతో రాపోలు కృష్ణమూర్తి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శి పదవికి ఆయిటిపాముల మురళీధర్, కోశాధికారి పదవికి రావిరాల నాగేందర్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. మిగిలిన ఐదుగురు గడ్డం రమణయ్య, రాపోలు వెంకటేశ్వర్లు, నామని సత్యం, పులిపాటి రామేశ్వరి, గుంటి చంద్రకళ కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ చిలుకూరి బాలకృష్ణ, రైస్ మిల్లర్స్ డైరెక్టర్ గుంటి గోపి, రచ్చ హనుమంతరావు, గుంటి శ్రీనివాస్, గోపి, శ్యామ్, వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది




**ప్రజాపక్షం/త్రిపురారం:** ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు.బుధవారం తెలంగాణ తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రత్న ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో త్రిపురారం మండలం దుగ్గేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జొన్నలగడ్డ అలివేలును ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి తపస్ ఉపాధ్యాయ సంఘం నేతలు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఎల్లవేళలా కృషి చేస్తుంటారని అన్నారు.ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను దైవంతో పోలుస్తారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని భాస్కర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి రాజశేఖర్,బుసిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు పాందురంగారెడ్డి,త్రిపురారం మండల శాఖ అధ్యక్షులు ఎం.రామ్ రెడ్డి,తెలుగు యూనివర్సిటీ వాగ్గేయకారుడు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే ఉండి లేనట్టే



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట నియోజక వర్గంలో ప్రజల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే ఉండి లేనట్లేనని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిపైనే అధికంగా ఆధారపడటం వల్ల మోటార్లు, యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దోసపహాడ్ నుంచి సుమారు 13 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఉన్నప్పటికి, అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేదన్నారు. పాలేరు నుంచి నీటిని తీసుకురావడంతోపాటు, ఇమాంపేట సమీపంలోని మిషన్ భగీరథ మార్గం ద్వారా మరో పైపులైన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండకుండా హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ భవన్ నుంచి విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, సూర్యాపేట, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాయకులు చింతమళ్ళ రమేష్, అబ్దుల్ రహీం, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడిగా మారపల్లి వేణు

**ప్రజాపక్షం/నాంపల్లి:** నాంపల్లి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించిన అనంతరం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జాతీయ స్థాయిలో మాదిగల పేదరిక నిర్మూలన కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని వ్యవస్థ కోసం భవిష్యత్తు పోరాటం కొనసాగుతుందని ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు కొమిరె స్వామి మాదిగ,ఎంఆర్‌పిఎస్ తాజా మాజీ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం తెలిపారు.బుధవారం మండల సీనియర్ నాయకులు బుషిపాక ఏదుకొండలు మాదిగ అధ్యక్షతన మండల ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ జరిగిన ఈ సమావేశానికి ఏమాదిగ హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మారపల్లి వేణు మాదిగ,ప్రధాన కార్యదర్శిగా శివ మాదిగ,కార్యదర్శిగా జనార్ధన్ మాదిగ,ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షురాలిగా మేకల కోటమ్మ,అధికార ప్రతినిధిగా బుషిపాక అంబేద్కర్ మాదిగ ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జిల్లా యాదయ్య మాదిగ,ఆకులపల్లి శ్రీను మాదిగ,పల్లెటి హరికృష్ణ మాదిగ,హరీష్ మాదిగ,బుషిపాక నరేష్ మాదిగ,జోగు యాదయ్య మాదిగ, మండలంలోని వివిధ గ్రామాల మాదిగ యువ నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రధాన ధ్యేయంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో, దామరచర్ల మండలం రాళ్లవాగు తండా గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమం అనంతరం నూతనంగా నిర్మించిన ఇళ్లలోని ప్రతీ గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల నాయకులు, మండల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాజకీయ ఒత్తిళ్ల కారణంగా బలహీన వర్గాలకు చెందిన జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేయడం తగదని బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ సీఐ ముత్తు యాదవ్‌పై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఆలస్యం జరిగిందనే ఆరోపణల నెపంతో బీసీ వర్గానికి చెందిన అధికారిని లక్ష్యంగా చేసుకోవడం సమర్థనీయం కాదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, స్వార్థ ప్రయోజనాల వల్ల వెనుకబడిన వర్గాలకు చెందిన అధికారులు బలిపశువులుగా మారడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌పై విధించిన సస్పెన్షన్‌ను ముఖ్యమంత్రి ఎత్తివేసి, ఆయనకు తక్షణమే పునరుద్యోగం కల్పించి పూర్తి న్యాయం చేయాలని బీసీ జేపీసీ తరఫున లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు.

## పౌష్టికాహారం అభినందనీయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** హెచ్ఐవీతో జీవిస్తున్న చిన్నారులకు నేస్తం సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఎంహెచ్ఓ,ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ పెండెం శంకర్,జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వీ ప్రసాద్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నేస్తం సొసైటీ కార్యాలయంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గుర్రం కేసరి,సిరికొండ వెంకట, చార్విస్ సాయిరామ్‌ల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిగధ మల్లిక, నేస్తం సొసైటీ అధ్యక్షుడు కే. వెంకన్న, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, లింగ స్వామి, శ్రీనివాస్,ఎం.డి.ఇనాయత్ పాల్గొన్నారు.

## సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నాగార్జున సాగర్ ఎడమ కాలువకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని హుజూర్‌నగర్ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేరేడుచర్ల పట్టణంలో సాగర్ నీటిని విడుదల చేయాలని రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్‌లో 535 అడుగులకు పైగా నీళ్లు ఉన్నా సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని మండిపడ్డారు.



## శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రవక్త బోధనలే పునాది

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహమ్మద్ ప్రవక్త అందించిన దివ్య బోధనలు ప్రపంచ మానవాళికి శాంతి, సోదర భావం, కరుణ, ఐక్యతలకు మార్గదర్శకాలని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని 47వ వార్డు ఇస్లాంపురంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మీలాద్‌ఉన్‌నబీ పర్వదిన వేడుకల్లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు, వార్డు ప్రజలు, యువకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు మహాధర్నా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సాగునీటి విడుదలపై జాప్యం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ రైతు ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతుందని బిఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో మాజీ జడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు మహాధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా ఆంధ్ర పాలకులు నీటిని తరలించుకు వెళ్తుంటే కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడం లేదన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సాగర్ జలశాయంలో 510 అడుగుల నీరున్న రైతులకు ఇబ్బంది లేకుండా మాజీమంత్రి జగదీష్‌రెడ్డి నీటిని విడుదల చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ అమర్, జక్కుల నాగేశ్వరరావు, పచ్చిపాల ఉపేందర్, ముల్కలపల్లి రాంబాబు, అద్దంకి సైదేశ్వరరావు, తుమ్మకొమ్ము సుందర్‌రావు, పరుశురాం పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సర్పంచ్

**ప్రజాపక్షం/దేవరకొండ;** మండల పరిధిలోని మైనంపల్లి గ్రామానికి చెందిన పులిజాల సాధన ఎల్లయ్య కు దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో మంజూరైన ఇందిరమ్మ ఇంటిని బుధవారం సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఎల్ఏ బాలునాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, వార్డు సభ్యులు సంతోష వెంకట్, నాగరాజు, సునిత, బద్రు, లక్ష్మీ ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.




## శాస్త్రీయ ఫలాలు సమాజ అభ్యుదయం వైపు ఉండాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** శాస్త్ర విజ్ఞాన ఫలాలు సమాజ ప్రగతికి,అభ్యుదయానికి ఉపయోగపడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్ పిలుపునిచ్చారు.బుధవారం నకిరేకల్ పట్టణంలో జెవివి డివిజన్ మహాసభ జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని,పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించినప్పుడే శాస్త్రీయ విద్య ప్రాముఖ్యత నెరవేరుతుందని పేర్కొన్నారు. అనంతరం డివిజన్, మండల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

జెవివి నకిరేకల్ డివిజన్ నూతన కమిటీ గౌరవాధ్యక్షుడుగా డాక్టర్ చేతరాజు రవి కిరణ్,అధ్యక్షురాలుగా కే. విజయలక్ష్మి,ప్రధాన కార్యదర్శిగా చల్లూరి శ్రీనివాస్, కోశాధికారిగా కుర్మిల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కనుకుంట్ల సుధీర్ రెడ్డి, డివిజన్ కార్యదర్శిగా రాపోలు రఘు,చెకుముకి కన్వీనర్ గా కె. శ్రీనివాస్,సమత విభాగం డివిజన్ గౌరవ అధ్యక్షురాలుగా డాక్టర్ శ్రీ భవ్య,అధ్యక్షురాలుగా పందు జ్యోతి,ప్రధాన కార్యదర్శిగా సంధ్య, ఉపాధ్యక్షురాలుగా పద్మలత, కోశాధికారిగా ఆండాలు ఎన్నికయ్యారు.నూతన కమిటీలను జెవివి జిల్లా కార్యదర్శులు గంగాధరి భద్రయ్య, యానాల కోకిల,ఒంటెపాక నగేష్,సమ్మెటి తిరుమలేష్,వాలుగొండ వెంకటేశ్వర్లు,అల్లం శంకర్ అభినందించారు.

## తుర్కపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రవి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశంలో తుర్కపల్లి మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన పెండెం రవి(వార్త రిపోర్టర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆరే, నర్సింహులు(నవ తెలంగాణ) ఉపాధ్యక్షులుగా, అక్కారం కృష్ణ, కొండం నాగరాజు, ఆకుల శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలనుపాక కొండల్(కనకరాజు ప్రజాపక్షం) ప్రధాన కార్యదర్శి పులిగిల్ల స్వామి(ఆంధ్ర ప్రభ)కోశాధికారి ఎం.డి.చాంద్ పాషా, సహాయ కార్యదర్శులు గడిపె ఇంద్రయ్య, ఆకుల రాజుకుమార్. గౌరవ సలహాదారులు షేక్ బురాన్, ప్రచార కార్యదర్శిగా పుట్ట అంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా తునికి శ్రీనివాస్, కర్రె



ఉపేందర్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పెండెం రవి మాట్లాడుతూ విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మండల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు, అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఆదిమూలం సురేష్, బేతాల బాబు, ఆకుల నవీన్, పుట్ట కార్తీక్, కొత్తింటి సురేష్, సుంకి శివలను ఎన్నుకున్నారు.

## రోడ్డు దాటుతున్న గీత కార్మికుడిని ఢీకొట్టిన బైక్

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** స్కూటిపై రోడ్డు దాటుతున్న గీతకార్మికుడిని బుల్లెట్ బైక్ ఢీకొట్టిన సంఘటన మండలంలోని పంతంగి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి65పై బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పంతంగి గ్రామానికి చెందిన పల్లె మల్లయ్య గీతకార్మికుడిగా పని చేస్తూ రోజువారిగా తాటి చెట్లను గీసి స్కూటిపై ఇంటికి వెళ్తుండగా పంతంగి స్టేజి వద్ద రాజమండ్రి నుండి హైద్రాబాద్ కు వెళ్తున్న బుల్లెట్ బైక్ స్కూటిని ఢీకొట్టింది. దీంతో గీతకార్మికుడు మల్లయ్య రోడ్డుపై పడగా స్వల్ప గాయాలు కాగా,బైక్‌పై ఉన్న వ్యక్తి గాల్లో ఎగిరి విజయవాడ వెళ్ళే వైపు రోడ్డులో ఎగిరిపడ్డాడు.అతని తలకు హెల్మెట్ ఉండడంతో ప్రాణహాని తప్పింది.బైక్ పై వెనక కూర్చున్న అతని కూతురుకు గాయాలు



అయ్యాయి.ప్రమాద సమయంలో గ్రామస్టేజి వద్ద హోటళ్ళలో ఉన్న స్థానికులు వెళ్ళి రోడ్డు పడిన వారిని లేపారు.వెంటనే టోల్‌ప్లాజా అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వడంతో వారిని చికిత్స కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఎవరికి ప్రాణహాని లేదు.ఈ ప్రమాదంతో జాతీయ రహదారి ఇరువైపుల భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## తీజ్ వేడుకలు..

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని రామ్ రామ్ బంజారా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపం వద్ద నిర్వహించిన తీజ్ ఉత్సవ వేడుకల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్, నేనావత్ కిషన్‌నాయక్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారికి రామ్ రామ్ బంజారా సంఘం కమిటి సభ్యులు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు.



## మదర్ థెరిసా జయంతి

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 116వ జయంతి వేడుకలు స్థానిక బిసి బాలికల వసతి గృహమునందు నిర్వహించుకోవడం జరిగింది. మదర్ థెరిసా చిత్ర పటానికి స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటి సభ్యులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, గోపి, వివిఆర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వెంకటేష్, రాజేష్, మల్లయ్య పాల్గొన్నారు.



## గోదావరి జలాలకై ఉద్యమించాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రాజెక్టుల పూర్తికై, మూసీ మురికి నీళ్లకు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాల సాధనకై ఊరు వాడై కదిలి ఉద్యమించుదామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుండి నిధుల సాధనకై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 29, 30, 31 తేదీలలో నిర్వహిస్తున్న పాదయాత్రను 31న మహాధర్నాలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. బుధవారం పోచంపల్లి పట్టణ కమిటీ సమావేశం నిర్వహన అనంతరం భువనగిరి చౌరస్తా వద్ద పిలాయపల్లి గ్రామాలలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పట్టణ కార్యదర్శులు కోట రామచంద్రా రెడ్డి, దుబ్బాక జగన్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, మండల కమిటీ సభ్యులు పత్తి బిక్షపతి పాల్గొన్నారు.

## కాటమయ్య సేఫ్టీ మోకుల శిక్షణ

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణంలో కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య సేఫ్టీ మోకులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులకు సేఫ్టీ మోకులను ఉపయోగించే విధానం, వృత్తిలో ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం (ట్రైనింగ్) నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే సమయంలో భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బాలాజీ నాయక్, ఎస్సై శంకర్, శివకృష్ణ, కానిస్టేబుల్ కృష్ణ, బీసీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ వెంకన్నపాల్గొన్నారు.



## గాదె లక్ష్మమ్మకు నివాళులు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం లక్ష్మీ దేవి గూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గాదె నరేందర్ రెడ్డి తల్లి దివంగత గాదె లక్ష్మమ్మ దశదినకర్మలో మాజీ మంత్రి, సూర్యపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారితో పాటు మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్, సీనియర్ నాయకులు చెంగల వెంకట కిషన్ రావు, బీబీనగర్ మాజీ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు రాచమల్ల శ్రీనివాస్పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని చౌటుప్పల్ సిఐ జి.మన్మథకుమార్,ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ లు అన్నారు. మునిసిపాలిటి పరిధిలోని శ్రీని ఫార్మా కంపెనీ కార్మికులకు రోడ్డు భద్రత నియమాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్ మాట్లాడుతూ,మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని,కార్లు, ఇతర వాహన చోదకులు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.ప్రతి ఒక్కరు బాధ్యతగా వాహనాలు నడపాలని,కుటుంబాల భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.రోడ్డు భద్రత పాటిస్తామని కార్మికులతో పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎఎస్సై సైదిరెడ్డి,పోలీస్ సిబ్బంది,కార్మికులు పాల్గొన్నారు.

